

విద్యారంగానికి పెద్దపీట వేస్తామని చెప్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో మాత్రం చిన్నచూపు చూస్తున్నది. విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా పాఠశాలల నిర్వహణకు నిధులు కేటాయించకపోవడం విస్మయం గొల్పుతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాఠశాలల ప్రారంభం నాటికే నిర్వహణ నిధుల(కాంపోజిట్ గ్రాంట్)ను ఆయా పాఠశాలలకు రెండు విడుతల్లో విడుదల చేసేది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదు. ఫలితంగా నిర్వహణ కష్టంగా మారుతున్నది. పాఠశాలలకు అవసరమైన రిజిస్టర్లు, రికార్డులు, చాక్‌పీసులు, ప్రయోగశాలల సామగ్రి, తదితర స్టేషనరీ సామగ్రిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అప్పు చేసి కొనాల్సిన దుస్థితి ఏర్పడింది. అంతేగాక క్రీడల నిర్వహణ నిధులు కూడా విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నది. రేపు, మాపు అంటూ సర్కారు కాలయాపన చేస్తుండడంతో విద్యాబోధన ప్రశ్నార్థకంగా మారుతోంది.

- జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ)/గిర్మాజీపేట/హనుమకొండ చౌరస్తా/మహబూబాబాద్ రూరల్




## నిధుల్లేవ్.. చదువులెట్ల ?

### అస్తవ్యస్తంగా సర్కారు పాఠశాలల నిర్వహణ

- విద్యాసంవత్సరం మొదలై నాలుగు నెలలైనా అందని స్కూల్ గ్రాంట్
- పేరుకే ప్రొసీడింగ్.. విడుదల కాని నిధులు
- అప్పు చేసి స్టేషనరీ కొనుగోలు చేస్తున్న హెచ్‌ఎంలు, టీచర్లు
- క్రీడల గ్రాంట్ పరిస్థితీ అంతే

విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ప్రభుత్వం పాఠశాలలకు నిర్వహణ నిధులు విడుదల చేయాలి. వాటితోటే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం, బడిబాట, పాఠశాలలకు అవసరమైన రిజిస్టర్లు, రికార్డులు, టీచింగ్ డైరీలు, స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, విద్యార్థులకు నిర్వహించే పరీక్షా సామగ్రి, చాక్‌పీస్‌లు, బోర్డులు, దినపత్రికలు, విద్యుత్ బిల్లులు, ఇతర అవసరాలను వెల్లదీయాల్సి ఉంటుంది. కానీ ఇప్పటివరకు నిధులు విడుదల చేయకపోవడంతో ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు సొంత డబ్బులతో బోధన, నిర్వహణ సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు మౌలిక వసతుల మధ్య విద్యాబోధన చేస్తూనే, వారిలో క్రీడా సామర్థ్యాలను కూడా పెంచాల్సి ఉంటుంది. అందుకు ప్రభుత్వం ఏటా క్రీడా నిధులు విడుదల చేయాలి. వాటిని కూడా నేటి వరకు ఇవ్వలేదు. పంద్రాగస్టుకు నిర్వహించే క్రీడాపోటీల ఖర్చులు, బహుమతులు కూడా చేతినుంచే పెట్టాల్సి వచ్చిందని పలువురు ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు వాపోయారు.

**త్వరలో మంజూరవుతాయంటున్న అధికారులు**

పాఠశాలల నిర్వహణకు సంబంధించి డిటేయిలింగ్ ప్రొసీడింగ్స్ వచ్చాయని రెండు, మూడు రోజుల్లో నిధులు మంజూరు అవుతాయని వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1 నుంచి 8 తరగతుల వరకు ఉన్న 425 పాఠశాలల్లో కాంపోజిట్ గ్రాంట్‌కు రూ.88 లక్షలు, క్రీడలకు రూ.24.6 లక్షలు మొత్తం రూ.1.12 కోట్లు, అలాగే 131 సెకండరీ పాఠశాలలకు కాంపోజిట్ గ్రాంట్‌లకు రూ.54.15 లక్షలు, క్రీడలకు రూ.32.75 లక్షలు కలిపి మొత్తం రూ.86.90 లక్షలకు గాను ప్రొసీడింగ్స్ వచ్చాయని చెబుతున్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి పాఠశాలల నిర్వహణకు సుమారు రూ.1.42 కోట్లు, క్రీడలకు రూ.57.35 లక్షలు కలిపి సుమారు రూ.1.99 కోట్లు ప్రొసీడింగ్స్ వచ్చాయని, ఇందులో 50శాతం నిధులను ప్రభుత్వం విడుదల చేయనున్నదని చెబుతున్నారు. హనుమకొండ జిల్లాలోని 542 పాఠశాలలకు సంవత్సరానికి గాను రూ.3.68 కోట్లు కాంపోజిట్ స్కూల్ గ్రాంట్ మంజూరు కావాల్సి ఉండగా మొదటి విడత కింద రూ.1.76 కోట్లు విడుదల కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

**పేరుకే ప్రొసీడింగ్స్**

విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలుగా గడుస్తున్నా స్కూల్ గ్రాంటును విడుదల చేయని ప్రభుత్వం కంటి తుడుపుగా నిధులు విడుదల చేస్తున్నట్లు ఒక ప్రొసీడింగ్ మాత్రం విడుదల చేసింది. నిధులు మాత్రం విడుదల కాలేదు. భూపాలపల్లి జిల్లాలో 334 ప్రైమరీ, 84 సెకండరీ పాఠశాలలు ఉన్నాయి. 339 ప్రైమరీ పాఠశాలలకు 100శాతం గ్రాంటు కింద స్కూల్ గ్రాంట్ రూ.60 లక్షలు, స్పోర్ట్స్ గ్రాంట్ రూ.19.25 లక్షలు విడుదల కావాల్సి ఉంది. అలాగే 84 సెకండరీ పాఠశాలలకు స్కూల్ గ్రాంట్ కింద రూ.32.50 లక్షలు, స్పోర్ట్స్ గ్రాంట్ కింద రూ.21 లక్షలు విడుదల కావాల్సి ఉంది. అయితే పాఠశాలలు పునఃప్రారంభంలో 50శాతం గ్రాంట్‌ను ప్రభుత్వం విడుదల చేస్తే ప్రధానోపాధ్యాయులు పాఠశాల నిర్వహణకు ఉపయోగిస్తారు. కాగా జిల్లాకు 50శాతం గ్రాంట్ కింద రూ.66.85 లక్షలు ఇప్పటికే విడుదల చేయాల్సి ఉంది. కాగా ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదు. మూడు రోజుల క్రితం మాత్రం నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రొసీడింగ్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

### నిధులు మంజూరు ఇలా..

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిర్వహణ నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుంది. 1 నుంచి 30మంది విద్యార్థులు ఉంటే రూ.10వేలు, 31 నుంచి 100 మంది ఉంటే రూ. 25 వేలు, 101 నుంచి 250 మంది ఉంటే రూ.50వేలు, 251 నుంచి వెయ్యి మంది వరకు ఉంటే రూ.75 వేలు, వెయ్యిమందికి పైగా ఉంటే రూ.లక్ష ప్రతి సంవత్సరానికి విడుదల చేస్తుంది. అలాగే క్రీడల కోసం ప్రాథమిక పాఠశాలలకు రూ.5 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.10వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.10వేలు అందిస్తుంది. పాఠశాలల గ్రాంట్స్ మంజూరు ఆలస్యం విషయంలో, జాడలేని క్రీడానిధులతోపాటు ఇతర విషయాలపై మాట్లాడేందుకు కూడా హెచ్‌ఎంలు, టీచర్లు భయపడుతుండడం గమనార్హం.



### సొంత డబ్బులతో స్టేషనరీ కొంటున్నాం

జూన్‌లోనే గ్రాంట్(50శాతం) విడుదల కావాల్సి ఉంది. పాఠశాలలు ప్రారంభమై నాలుగు నెలలైనా స్కూల్ కాంపోజిట్ గ్రాంట్ విడుదల కాకపోవడంతో సొంత డబ్బులతో స్టేషనరీ కొనుగోలు చేసి చదువులు చెబుతున్నాం. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించకపోవడంతో పారిశుధ్య పనులు ఆగిపోయాయి. దీంతో ఉపాధ్యాయులు, మేము డబ్బులు జమ చేసి ఒకరిని నియమించుకొని పనులు చేయిస్తున్నాం. గ్రాంట్ రిలీజ్ అయినట్లు ప్రొసీడింగ్ మాత్రమే వచ్చింది. డబ్బులు మాత్రం అకౌంట్లలో పడలేదు. వెంటనే రిలీజ్ చేయాలి. స్కావెంజర్లను నియమించాలి.

– ఎల్.లక్ష్మీప్రసన్న, జడ్పీహెచ్‌ఎస్ ప్రిన్సిపాల్, భూపాలపల్లి

### ప్రభుత్వం హామీలకే పరిమితమైంది..



ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు. స్కూల్ గ్రాంట్ విషయమై అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పుడు, అప్పుడు అని కాలయాపన చేస్తున్నారు. విద్యార్థులకు చార్ట్‌లు, మ్యాప్‌లు తీసుకొద్దామంటే స్కూల్ అకౌంట్లో డబ్బులు లేక హెచ్‌ఎంలు భరించాల్సి వస్తోంది. పాఠశాలలో కనీస సౌకర్యాలు ఉండేలా ప్రభుత్వం చొరవ చూపాలి. అప్పుడే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుంది. సర్కారు ఆలస్యం చేయకుండా వెంటనే స్కూల్ గ్రాంట్‌ను ఖాతాలో జమచేయాలి.

– పులి దేవేందర్, పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ట్రెజరీ



పర్వతగిరి మండల పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

## భవిష్యత్ బీఆర్ఎస్‌దే..

- కార్యకర్తలు అధైర్యపడొద్దు
- రుణమాఫీ పేరుతో రైతులను ముంచిన కాంగ్రెస్ పార్టీ
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పర్వతగిరి, సెప్టెంబర్18: భవిష్యత్ బీఆర్ఎస్ పార్టీదేనని, కార్యకర్తలు అధైర్య పడొద్దని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం పర్వతగిరిలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుకు వెళ్లి రుణ మాఫీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మండల కార్యాలయాన్ని ఎర్రబెల్లి సందర్శించారు. బ్యాంకు పరిధిలో 600 మంది రైతులు రూ. 6 కోట్ల రుణం తీసుకుంటే 200 మందికి రూ. కోటీ 30 లక్షలు రుణమాఫీ అమలైందని బ్యాంకు సిబ్బంది తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు ఫోన్ చేసి వెంటనే రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ సందర్భంగా దయాకర్ రావు మాట్లాడుతూ రైతుబంధుకు రాంరాం.. చెప్పి రుణ మాఫీ పేరుతో అనేక ఆంక్షలు విధించి రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. సీఎం రేవంత్ పూటకో మాట మాట్లాడుతూ ప్రజా పాలన పేరుతో హామీలు ఇచ్చి అన్ని వర్గాలను మోసగిస్తున్నాడని అన్నారు. కనీస అవగాహన లేకుండా ముఖ్యమంత్రి, మంత్రులు తలా తోక లేకుండా మాట్లాడుతూ రాష్ట్రాన్ని అంధ కారంలోకి నెట్టేస్తున్నారని దుయ్యబట్టారు. సాగు, తాగు నీరు లేకుండా ఆగం చేస్తున్నారని మండిపడ్డారు. రుణమాఫీ కాని రైతులకు భారత రాష్ట్ర సమితి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి పటిష్టం చేసుకోవాలని సూచించారు. పార్టీ కార్యాలయం వద్ద ఉన్న నాయకులు, కార్యకర్తలను పేరుపేరునా పలకరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీలు మాడు గుల రాజు, కర్మిళ్ల మోహన్‌రావు, మాజీ సర్పంచ్ చిన్నపాక శ్రీనివాస్, ఏర్పుల శ్రీనివాస్, అమడగాని రాజు, బానోత్ వెంకన్న, బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రంగు కుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు మట్టపెల్లి చిన్న మాధవరావు, చింతల శ్రీనివాస్, మండల రైతు విభా గం అధ్యక్షుడు బాల్లె వెంకటరాజు, యూత్ అధ్యక్షుడు బూర శ్యామ్‌గౌడ్, సంపత్, మహిళా విభాగం అధ్యక్షురాలు బరిగెల విజయ, నాయకులు దేవా కుమార్, కొండ వెంకన్న, భిక్షపతి, విజయ్ పాల్గొన్నారు..



బీఆర్ఎస్ కార్పొరేటర్ మరుపల్ల రవి చేపట్టిన ప్రజా నిరసన దీక్షను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

## అభివృద్ధి పనుల్లో మేయర్‌ది పక్షపాత వైఖరి

- సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం
- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

వరంగల్, సెప్టెంబర్ 18 : ప్రజా సమస్యలను పరిష్కరించడంలో బల్దియా అధికారులు విఫలం అవుతున్నారని, మేయర్ గుండు సుధారాణి అభివృద్ధి పనుల్లో పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ విమర్శించారు. బుధవారం కార్పొరేషన్ ఎదుట సమస్యలను పరిష్కరించాలని 40 డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ మరుపల్ల రవి, నాయకులు ప్రజా నిరసన దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ సమస్యలను పరిష్కరించే వరకు మరుపల్ల రవికి వెన్నంటి ఉంటామన్నారు. డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్ మాట్లాడుతూ.. సమస్యలను పట్టించుకోకుండా మేయర్, అధికారులు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. కార్పొరేటర్ రవి మాట్లాడుతూ.. డివిజన్ సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు మేయర్, కమిషనర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా డివిజన్ సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. కాగా, కార్పొరేటర్ రవి చేపట్టిన ప్రజా నిరసన దీక్షకు బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఎడ్ల అశోక్‌రెడ్డి, పుల్లారావు, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్లు ఆవాల రాధికారెడ్డి, దిడ్డి కుమారస్వామి, గుగులోత్ దివ్యారాణి, సీపీఎం నాయకులు సింగారపు బాబు సంఘీభావం తెలిపారు. దీక్షలో ఆకుతోట రాజు, పూదరి విజయ్, వనం కుమార్, మరుపల్ల గౌతమ్, కుండె రాజు, బొల్లం యాకయ్య, మిర్యాల కుమారస్వామి, రాజేశ్వర్, రాజన్‌బాబు, శరబంధం, పసుపూరి రమేశ్, మేకల రవి, మంద నవీన్ పాల్గొన్నారు.

## చట్టం అధికార పార్టీకి చుట్టమా ?

- ఘర్షణలో గాయపడిన వారిపై కేసులా?
- నిష్పక్షపాతంగా విచారణ జరపాలి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

న్యూశాయంపేట, సెప్టెంబర్ 18 : ఘర్షణలో గాయపడిన వారిపై కేసులు నమోదు చేయడం సబబు కాదని, చట్టం అధికార పార్టీకి చుట్టమా అని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నిలదీశారు. బుధవారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. శాయంపేట మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలో సోమవారం రాత్రి గణేశ్ శోభాయాత్రలో జరిగిన ఘర్షణలో గాయపడిన వారిపై, దాడి చేసి వారిపై కేసు నమోదు చేసి ఆపై కాంప్రమైజ్ అవండి అంటూ ఉచిత సలహా ఇవ్వడం గర్హనీయమన్నారు. పోలీసుల తీరుతో ప్రజలకు చట్టాలు, పోలీసులపై నమ్మకం లేకుండా చేస్తున్నాయన్నారు. పోలీసులు అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో పనిచేయడం దౌర్భాగ్యమని, ఇటీవల బీఆర్ఎస్ మాజీ ఎంపీపీపై తప్పుడు కేసులు పెట్టారని, దీనిపై హైకోర్టును ఆశ్రయించామన్నారు. కిందిస్థాయి అధికారులు తప్పు చేస్తే పైస్థాయి అధికారులు సరిచేయాల్సింది పోయి అందరూ ఒకేలా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై ప్రత్యేక అధికారిని నియమించి నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి తప్పు చేసిన వారిని, తప్పుడు కేసులు పెట్టిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని వరంగల్ సీపీ, డీజీపీని కోరుతున్నామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, పోతు రమణారెడ్డి, కశ్ర ఆదిరెడ్డి, అరికెల ప్రసాద్, మాదారం మల్లయ్య, దూలం నాగరాజు, మాదాసి సతీశ్, మునుకుంట్ల రవి, కొసరి రాజు, వినుకొండ సురేందర్ చారి, మోరె మహేందర్ పాల్గొన్నారు.



హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

## నష్టం కొండంత.. సాయం గోరంత



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వరద బాధితులు

- రావిరాల గ్రామంలో నిరాశ్రయులైన గ్రామస్తులు
- 437 మందిలో కేవలం 143 మందికే సాయమందిస్తారా?
- మాకెందుకివ్వరని ప్రశ్నిస్తున్న మిగిలిన బాధితులు
- 200 మంది తహసీల్‌కు చేరుకొని డీటీకి వినతి

నెల్లికుదురు, సెప్టెంబర్ 18: మండలంలోని రావిరాల గ్రామంలో భారీ వర్షాలతో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన గ్రామస్తులకు కొద్ది మందికే సాయం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో సుమారుగా వరద బాధితులు 437మంది ఉంటే కేవలం143 మందిని ఎంపిక చేశారు. అందులో పూర్తిగా నష్టం జరిగిన 22 మంది ఒక్కొక్కరికి రూ. 16,500, పాక్షికంగా నష్టపోయిన 121 మందికి రూ. 10 వేల చొప్పున వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు. ఆ 143 మందిని స్వచ్ఛంద సంస్థలు, పార్టీలు, ప్రజా సంఘాలు, ఫౌండేషన్లు ఆదుకున్నాయి. మిగిలిన 294 కుటుంబాలు ఎవరి సాయం అందక, అన్నీ కోల్పోయి అరిగోస పడుతున్నారు. మమ్ముల్ని ఆలకించే వారే లేరా.. మాకు సర్కారు సాయం అందివ్వరా అని వారు ప్రశ్నిస్తున్నారు. అర్హుల జాబితను సిద్ధం చేసే క్రమంలో రాజకీయ పలుకుబడితో అనర్హులకు పెద్దపీట వేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**తహసీల్‌కు చేరిన 200 బాధితులు..**

వరద బాధితుల జాబితాలో తమ పేర్లు లేని 200 మంది గ్రామస్తులు ఆటోలో తహసీల్దార్ కార్యాలయానికి మాకూ సర్కారు నుంచి సాయం అందివ్వాలని కోరారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం రూ. 10 వేలివ్వాలని మార్క బుచ్చమ్మ, స్వాతి, జయమ్మ, హైమావతి, భాగ్యమ్మ, రాజమ్మ, ఉమారాణి, లక్ష్మి తదితరులు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ లేకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్ తరంగిణికి వినతి పత్రం అందజేశారు.

### ప్రతి ఇంటికి రూ.10 వేలివ్వాలి



రావిరాల గ్రామంలో ప్రతి ఒక్కరు అన్నీ కోల్పోయి నిరాశ్రయులయ్యారు. చేసుకోవడానికి కూలీ పనులు లేవు. ఇండ్లు కూలిన వారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలి. రైతులకు ఎకరాకు రూ. 50 వేల పంటనష్టపరిహారం అందివ్వాలి. ప్రతి కుటుంబానికి రూ. 10 వేలు వారి ఖాతాల్లో జమ చేయాలి. వరద బాధితుల అర్హుల జాబితాల్లో అవకతవకలు జరిగాయి. అనర్హులకు పెద్ద పీట వేశారు.

– ఆకుల జగ్గయ్య, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు, రావిరాల గ్రామం

## తాగునీటికి కష్టాలు..

- పది రోజులుగా కౌసల్యాదేవిపల్లిలో మహిళల అవస్థలు
- వ్యవసాయ బావుల వద్దకు పరుగులు



నీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

నర్సింహులపేట, సెప్టెంబర్ 18 : తాగునీటి కోసం నర్సింహులపేట మండలం కౌసల్యాదేవిపల్లి ఎస్సీకాలనీ మహిళలు తిప్పలు పడుతున్నారు. వాటర్‌ట్యాంక్ ఉన్నప్పటికీ పైపులు పగిలిపోయాయి. మరమ్మతులు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తుండడంతో పది రోజులుగా తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి పట్టించుకోకపోవడంతో వ్యవసాయ బావుల వద్దకు వెళ్తే మిరప తోటలు, పొలం పారించడం కష్టమవుతోందని రైతులు అడ్డుకుంటున్నారని చెబుతున్నారు.

### మా గోస పట్టించుకోండి



పది రోజులుగా నీళ్లు లేక బావుల కాడికి పోయి పట్టుకొస్తున్నం. పొలాలకు నీళ్లు పెట్టుకుంటున్నామని అక్కడికి రావొద్దని రైతులంటున్రు. వానకాలంలో నీళ్ల కోసం తిప్పలు ఎప్పుడూ చూడలేదు. పైఅధికారులు మా గోసను పట్టించుకోండి. మాకు నీళ్లు వచ్చేలా చేయండి సారూ. మీకు దండం పెడ్తాం.

– ఎర్పుల మంగమ్మ, కౌసల్యదేవిపల్లి


## బాలుడికి మద్యం తాగించిన ఇద్దరిపై కేసు

జఫర్‌గడ్, సెప్టెంబర్ 18: మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన బాలుడు బక్కం వరుణ్ సందేశ్(16)కు మద్యం తాగించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదైంది. ఎస్సై రామ్‌చరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బక్కం కర్ణాకర్ కుమారుడు వరుణ్ సందేశ్‌కు పెంతల రాజ్‌కుమార్, పెంతల మహేశ్ ఈ నెల 16న వినాయక నిమజ్జనం సందర్భంగా కూల్‌డ్రింక్‌లో మద్యం పోసి తాగించారు. దీంతో వరుణ్ వాంతులు చేసుకుని స్పృహ కోల్పోయాడు. కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో తండ్రి కర్ణాకర్ గ్రామస్తుల సహాయంతో చికిత్స నిమిత్తం హనుమకొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఆన్‌లైన్‌లో తప్పులు.. తప్పని తిప్పలు

- 'ఆరు గ్యారెంటీల' కోసం బారులు తీరిన ప్రజలు

జనగామ రూరల్, సెప్టెంబర్18: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించగా, జనగామ జిల్లాలో ఇప్పటికీ అవి పరిష్కారానికి నోచుకోలేదు. ఆన్‌లైన్‌లో ప్రజల వివరాలను అధికారులు తప్పుల తడకగా నమోదు చేయడంతో లబ్ధిదారులకు పథకాలు వర్తించడం లేదు. గృహజ్యోతి పథకంలో జీరో బిల్లు, గ్యాస్ సబ్సిడీ రాక ప్రభుత్వ కార్యాలయాలకు చెప్పులరిగేలా తిరుగుతున్నారు. మళ్లీ దరఖాస్తులు చేసుకునేందుకు జనగామకు వచ్చామని, ఇప్పటికైనా అధికారులు ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ పథకాలను అందించేలా చూడాలని కోరారు.



జనగామ ఎంపీడీవో కార్యాలయంలో ఆరు గ్యారెంటీల పథకాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటున్న వివిధ గ్రామాల ప్రజలు